అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలి

- మండల పరిషత్ సమావేశంలో సభ్యుల డిమాండ్

మాట్లాడుతున్న అధికారులు

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యుడు

తాండూర్, మార్చి 1 : తాండూర్ మండలంలోని అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ పనితీరుపై అధికారులు తనిఖీలు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన తాండూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత సూపర్‌వైజర్లు పర్యవేక్షించడం లేదని కొన్ని కేంద్రాల్లో పిల్లలు లేకపోయినా సరిగ్గా రాకపోయినా పౌష్టికాహారాన్ని అందజేసినట్లు బిల్లులు మాత్రం చూపెడుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రాలను ఇండ్లలోనే కొనసాగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు సిరంగి శంకర్, దాగం నారాయణ కోరారు. ఎంపీపీ, ఎంపీడీవో పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తాండూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నివేదిక చదువుతుండగా మూడు నెలలకోసారి నిర్వహించే సభకు వైద్యాధికారి ఎందుకు రావడం లేదని సభ్యులు ప్రశ్నించారు. తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయానికి ఎంతో మంది పిల్లలు సర్టిఫికెట్ల కోసం వస్తున్నారని, సంబంధిత శాఖ అధికారులు గెజిటెడ్ సంతకంతో పాటు లాయర్ అఫ్‌డవిట్ కావాలని అడుగుతున్నారని దీంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తహసీల్దార్ స్పందించి కొన్ని అంశాలను సవరించాలని సభా దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఉపాధి హామీలో కొత్తవారికి ఉపాధి పని కల్పించాలని వారికి బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా చూడాలని, వెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులను ఎవరినీ పిలవడం లేదని కొంతమంది సభ్యులు సభా దృష్టికి తీసుకువచ్చారు. ఉచిత విద్యుత్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ఎలక్ట్రికల్ ఏఈ సమావేశంలో తెలిపారు. ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశానికి రాని అధికారులపై జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సింగిల్ విండో చైర్మన్ దత్తమూర్తి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వేమనపల్లి, మార్చి 1 : మండలంలోని రైతుల ధరణి పోర్టల్‌లోని సమస్యలను స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 89 మంది రైతులకు చెందిన ధరణి సమస్యలున్నట్లు తెలిపారు. మొదటి రోజు 8 పట్టాదారు పుస్తకాల సవరణ, విరాసత్ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో రెండు టీంలుగా ఏర్పడి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఇద్దరికి జరిమానా

లక్షెట్టిపేట, మార్చి 1: దాడి కేసులో ఇద్దరికి లక్షెట్టిపేట న్యాయస్థానం జరిమానా విధించినట్లు ఎస్ఐ చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన అప్పని లింగయ్య పొలంలోకి అదే గ్రామానికి చెందిన సూరమల్ల చంద్రయ్య, సూరమల్ల దుర్గయ్య 2018 సంవత్సరం ఆగస్టులో అకారణంగా చొరబడి పొలాన్ని ధ్వంసం చేశారు. లింగయ్యపై దాడి చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఆది మధుసూదన్‌రావు కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహిన్ సుల్తానా సమక్షంలో విచారణ చేపట్టారు. నేరం రుజువుకావడంతో చంద్రయ్యకు రూ.200, దుర్గయ్యకు రూ.1000 జరిమానాను జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ విధించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మంచిర్యాలటౌన్, మార్చి 1: వసతిగృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బచ్చలి అభిరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్లు సమయ పాలన పాటించడం లేదని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జేవీఎస్, టీవీయూవీ సంఘాల నాయకులు, సభ్యులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, MANUBOTHULA RAJAIAH, S/o. Manubothula Yerraiah, R/o.1-33, Jaipur, Mancherial, TS. Changed My Name as MANUBOTHULA RAJ KIRAN, S/o. Manubothula Yerraiah all Records purpose. NT-319753

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, జనగామ: 91827 77679
సిద్దిపేట: 91827 77671, 91827 77677

ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు భూమిపూజ

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవననిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

జైపూర్, మార్చి 1: మండలంలోని ఇందారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భూమి పూజ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో ఈ ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఇందారం గ్రామపంచాయతీ కాశింపల్లెలో రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గణపతి, కుందారం మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, ఎంపీడీవో సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్, వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, గూడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుంకరి శ్రీనివాస్, బేతు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

మంచిర్యాల ఏసీసీ, మార్చి 1: మంచిర్యాలకు చెందిన కేలం శంకరయ్య(55) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మంచిర్యాల ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజినీర్‌గా పని చేస్తున్న కృష్ణ తన తండ్రి నేత్రాలను కుటుంబ సభ్యులను ఒప్పించి దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకరయ్య నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు అందజేశారు. టెక్నిషియన్ రాజేంద్రప్రసాద్ సేకరించి వాటిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు కృష్ణను అభినందించారు. అనంతరం నేత్రదాత కుటుంబానికి ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ద్వారా అభినందన పత్రాన్ని అందజేశారు.

పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి శైలజ

లక్షెట్టిపేట, మార్చి 1: ఇంటర్ విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి ముందే సెంటర్‌కు వచ్చే ప్రయత్నం చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి శైలజ శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని అంతకు ముందు సుమారు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు పంపిస్తామని 9 గంటలకు పరీక్ష ప్రారంభిస్తారని ఆ సమయం లోపు సెంటర్‌కు చేరుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా 14416 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేట్ కంట్రోల్ రూం నంబర్ 040-24655027 సర్వీసు 24/7 అందుబాటులో ఉంటుందని డీఐవో చెప్పారు.

432 మంది విద్యార్థుల గైర్హాజరు..

మంచిర్యాలటౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ మొ దటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 25 సెంటర్లలో 6934 మం ది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 432 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 6502 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో 5445 మంది విద్యార్థులు జనరల్ ఇంటర్ కాగా, 1057 మంది వొకేషనల్ విద్యార్థులు ఉన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

దండేపల్లి, మార్చి1: మార్చి3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడుకునేందుకు పుట్టిన శిశువు నుంచి 5 యేండ్ల వయస్సు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, వైద్యాధికారులు సతీశ్, క్రాంతికుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఏఎన్ ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుర్చీలు, ఫ్యాన్ ల పంపిణీ

ముదిగుంట పాఠశాలలో కుర్చీలు అందిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు

జైపూర్, మార్చి 1: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ముదికుంట, కుందారం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు శుక్రవారం కుర్చీలు, ఫ్యాన్ లు పంపిణీ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద తమ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్లు జీ సురేశ్ కుమార్, ఈ లక్ష్మణ్, వీ .సునీత, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అటవీ అభివృద్ధి సంస్థ సూపర్ వైజర్లు రాజేశ్, వాచర్లు శంకర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు

భీమారంలో..

భీమారం పాఠశాలలో..

భీమారం, మార్చి 1 : రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు తమవంతుగా సహాయం చేసినట్లు సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విక్రమ్ కుమార్, ప్లాంటేషన్ మేనేజర్ జీ సురేశ్ కుమార్, ఈ లక్ష్మణ్, వీ సునీత, జూనియర్ అసిస్టెంట్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం

అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్(టీఎస్) నాయకులు

చెన్నూర్, మార్చి 1: చెన్నూర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు తగరం మధురాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలపై బీజేపీ వర్గీకరణ పేరుతో నాటకం ఆడుతుందని ఆరోపించారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఎన్నికలోపే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు రాజు, ప్రశాంత్, మల్లేశ్, సతీశ్, శ్రీధర్, అశోక్, పోచం, దేవయ్య, రాజ్యం, పున్నం, ఆగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య చలివేంద్రం ప్రారంభం

తాండూర్, మార్చి 1 : ఎంఏ ఫ్యామిలీ ఆధ్వర్యంలో తాండూర్‌లోని వారి ఫామ్ హౌస్ వద్ద రహదారిపై శుక్రవారం నిత్య చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఏ ఫామ్ హౌస్ ఎండీ దావూద్ మాట్లాడుతూ ఫామ్ హౌస్ నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు నిత్య చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యు లు ఎండీ సుబూర్, ఎండీ జక్రియ, సిద్ధిక్, అఖిల్ భాయ్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

భీమారం, మార్చి 1 : భీమారం మండలంలోని ఆరపల్లికి చెందిన ఉప్కుమల్ల సునీల్(21) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న సునీల్ ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల దవాఖానకు, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మద్యానికి బానిసై..

వేమనపల్లి, మార్చి 1 : మండలంలోని జక్కెపల్లికి చెందిన పొర్నెట్టి అశోక్ (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..11 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అనసూయను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి నలుగురు పిల్లలున్నారు. రెండేళ్ల నుంచి జల్సాలు, మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య మందలించడంతో మనస్తాపానికి గురై గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెయింట్ జాన్స్‌లో ఎడ్యు-కార్నివాల్

ప్రాజెక్టులను వివరిస్తున్న విద్యార్థులు

రామకృష్ణాపూర్, మార్చి 1: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శుక్రవారం 'ఎడ్యు కార్నివాల్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన సుమారు 148 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎడ్యు-కార్నివాల్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పొన్నాల సుమన్ తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు.

శ్రీచైతన్యలో సైన్స్‌ఎక్స్‌పో

ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈవో పోచయ్య

మంచిర్యాలటౌన్, మార్చి 1: మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీనగర్ బ్రాంచ్ శ్రీచైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో జాడి పోచయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను చూసి అభినందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయూబ్, ఒకటవ బ్రాంచ్ ప్రిన్సిపాల్ జాబిన్, కో ఆర్డినేటర్లు కోటేశ్వరరావు, జయశ్రీ, రోజారాణి, ఇన్‌చార్జిలు రమేశ్, ఆసియా, కృష్ణవేణి, తదితరులున్నారు.

సాలిగాం కాల్పుల కేసులో నిందితుడి అరెస్ట్

- మూడు రోజుల్లోనే చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు
- బైక్, సెల్‌ఫోన్, పిస్టల్, ఆరు బుల్లెట్లు, రెండు ఖాళీ తూటాలు స్వాధీనం
- బెల్లంపల్లిలో వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికుమార్

నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

స్వాధీనం చేసుకున్న గన్, బుల్లెట్లు

బెల్లంపల్లిరూరల్, మార్చి 1: మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామంలో గత నెల 27న రాత్రి గోలేటి శంకర్ కుటుంబసభ్యులపై కాల్పులు జరిపిన నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం బెల్లంపల్లిరూరల్ సీఐ కార్యాలయంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2016లో మాలగురిజాలకు చెందిన గోమాస నరేందర్‌కు, సాలిగాం గ్రామానికి చెందిన గోలేటి శంకర్ కూతురు బేబీకి వివాహం జరిగింది. నరేందర్ కరీంనగర్‌లో పేపర్‌ప్లేట్ల తయారీ కంపెనీలో పని చేస్తూ భార్యాపిల్లలతో కలిసి నివాసముండేవాడు. బేబీ ప్రతిమ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్‌గా పని చేసేది. కూతురు పుట్టడంతో ఉద్యోగం మానేసింది. జల్సాలకు అలవాటు పడిన గోమాస నరేందర్ పెళ్లి సమయంలో ఇస్తానన్న రూ. 10 లక్షల కట్నం కోసం నిత్యం అత్తామామలతో పాటు భార్య బేబీని తీవ్రంగా వేధించేవాడు. గతేడాది అత్తామామలను చంపాలని గొడ్డలితో సాలిగాం గ్రామానికి వెళ్లి బెదిరించగా, గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అప్పటి నుంచి నరేందర్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆరునెలల క్రితం తనతో పాటు కరీంనగర్‌లోని పేపర్‌ప్లేట్ల కంపెనీలో పని చేసే బిహార్‌కు చెందిన రవీందర్ పెళ్లికి వెళ్లాడు. బిహార్‌లో పిస్టల్, ఎనిమిది రౌండ్ల తూటాలను కొనుగోలు చేశాడు. గత నెల 27న మాలగురిజాలకు చేరుకున్నాడు. తన స్నేహితుడైన కోడి మహేశ్‌ను బైక్‌పై ఎక్కించుకొని సాలిగాం గ్రామానికి వెళ్లాడు. పిస్టల్‌తో అత్తామామలైన గోలేటి శంకర్, లక్ష్మిని బెదిరించడంతో వారు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడై పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఎవరూ బయటికి రాకపోవడంతో అక్కడి నుంచి బైక్‌పై కోడి మహేశ్‌తో కలిసి మాలగురిజాలకు వెళ్లిపోయాడు. గోలేటి శంకర్ ఫిర్యాదు మేరకు కన్నెపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మంచిర్యాల డీసీపీ ఆదేశాలతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి శుక్రవారం నిందితుడు గోమాస నరేందర్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్‌తో పాటు పిస్టల్, ఆరు బుల్లెట్లు, రెండు ఖాళీ తూటాలను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో ప్రమేయమున్న కోడి మహేశ్ పరారీలో ఉన్నాడు. మూడు రోజుల్లోనే నిందితుడిని పట్టుకున్న బెల్లంపల్లిరూరల్ సీఐ అప్జలొద్దీన్, తాళ్లగురిజాల, మాదారం, భీమిని ఎస్ఐలు నరేశ్, అశోక్, ప్రశాంత్‌ను ఐజీ శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు.

సింగరేణి

రోజూ 2.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి : సీఎండీ బలరాం

గోదావరిఖని, మార్చి 1: ఈ ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో రోజుకు 2.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, అదే పరిమాణంలో రవాణా చేసి నెలాఖారుకు 700 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని అధిగమించాలని సింగరేణి సీఎండీ బలరాం కోరారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన డైరెక్టర్లు, జీఎంలతో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్షించారు. కరోనా తర్వాత తొలిసారి ప్రత్యక్ష సమావేశం నిర్వహించి ప్రతి ఏరియా జీఎంతో సమగ్రంగా చర్చించారు. లక్ష్య సాధనకు ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించి పరిష్కారం సూచించారు. లక్ష్య సాధనకు అధికారులు, కార్మికులు సమన్వయంతో మందుకెళ్లాలన్నారు. గతేడాది ఈ సమయానికి 601 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా ఈ ఏడాది 4.3 శాతం వృద్ధితో 627 లక్షల టన్నులు చేశామని, గతేడాది 600 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయగా ప్రస్తుతం 5 శాతం వృద్ధితో 631 లక్షల టన్నులు రవాణా చేశామన్నారు. గత ఫిబ్రవరి చివరకు 2.7 వృద్ధితో 381 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించామన్నారు. ఇక్కడ సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, ఈడీ అల్విన్, జీఎం కోఆర్డినేషన్ సురేశ్, ఎన్విరాన్‌మెంట్ జీఎం జేవియర్ గణపతి, మార్కెటింగ్ జీఎం దేవేందర్ ఉన్నారు.

'ఆర్కే 6'లో నెల ముందే లక్ష్య సాధన

- 1.80 లక్షల టన్నుల ఉత్పత్తి
- మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం 1.80 లక్షల టన్నులు 30 రోజుల ముందే సాధించింది. శుక్రవారం గనిపై విలేకరులతో మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఈ గనికి నిర్దేశించిన 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని శుక్రవారం మొదటి బదిలీతో 100 శాతం సాధించినట్లు తెలిపారు. తెలిపారు. ఆర్కే 6గని వరుసగా 6వ సంవత్సరం కూడా వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించినట్లు వివరించారు. కార్మికులు, సూపర్‌వైజర్, అధికారుల సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గని ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్కే 6గని వార్షిక ఉత్పత్తి సాధించడంపై కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ కార్మికులు గని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంగం సదానందం పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్, మార్చి 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదర్శ గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాలలు, హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని వాటర్‌స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలను నిర్వహిసున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మడావి గంగారాం, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం తెలిపారు. ఈ నెల 6న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (సున్నంబట్టి వాడ)లోని క్రీడా మైదానంలో ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని